

31న చలో రాజ్‌భవన్‌కు తరలిరండి: డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణకు అనుమతులు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈనెల 31న 'చలో రాజ్‌భవన్' చేపడతామని డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ వెల్లడించారు. మంగళవారం కేపీసీసీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కుమారస్వామి, మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళజొల్లె, జనార్దనరెడ్డిపై ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీరిపైనా ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వాలన్నారు. విధానసౌధ నుంచి బయల్దేరి రాజ్‌భవన్‌కు వెళ్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు.

పరప్పన జైలు ఇక 3 విభాగాలు



- ఖైదీలు, విచారణ ఖైదీలు, మహిళా ఖైదీలకు వేర్వేరు బ్లాకులు
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు కసరత్తు
- హోంశాఖ మంత్రి సమీక్ష ● త్వరలో ముఖ్యమంత్రికి నివేదిక



బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహారలోని సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న నటుడు దర్శన్ రౌడీషీటర్‌తో కలసి పిచ్చాపాటిగా కాఫీ, సిగరెట్ సేవిస్తూ వైరల్ అయిన ఫొటోలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. జైళ్లు, పోలీసుశాఖ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ విరుచుకుపడ్డాయి. పరప్పన జైలులో వివాదాలు కొత్తేమీ కాదు. దశాబ్దాల కాలంగా ఇటువంటి సంఘటనలు తరచూ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. దీంతో జైలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు మూడు విభాగాలుగా చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అనుమతి పొందేందుకు హోంశాఖ నివేదిక సిద్ధం చేస్తోంది. రెండు మూడు రోజుల్లోనే హోంశాఖ మంత్రి పరమేశ్వర్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి అంతిమ నిర్ణయాన్ని తీసుకోనున్నట్టు తెలుస్తోంది. పరప్పన జైలును మూడు విభాగాలుగా చేయదలిచారు. ఖైదీలు, విచారణ ఖైదీలు, మహిళా ఖైదీలను వేర్వేరుగా విభజిస్తారు. రాష్ట్రంలోని అతిపెద్ద జైలును మూడు విభాగాలుగా చేస్తే అధికారులు, సిబ్బందిని కూడా మార్పు చేస్తారు. తద్వారా జైలు భద్రత, పాలనాపరమైన నిర్ణయాలకు అనుకూలంగా ఉంటుందని జైళ్లశాఖ భావిస్తోంది. పరప్పన అగ్రహార జైలు శ్రీమంత ఖైదీల పాలిట స్వర్గమనే పేరు ఉంది. ఇక్కడ డబ్బులు చెల్లిస్తే డ్రగ్స్, మొబైల్, ప్రత్యేక భోజనం, విలాసవంతమైన సేవలు లభిస్తాయనే విమర్శలు తరచూ వస్తుంటాయి. అందుకు నిదర్శనంగానే సీసీబీ, సాధారణ పోలీసులు పలుమార్లు జరిపిన దాడుల్లో డ్రగ్స్, మొబైల్ ఫోన్లు, తుపాకులు వంటి వస్తువులు లభించాయి. అందుకు నిదర్శనమే దర్శన్‌కు రాచమర్యాదలు కల్పించిన ఫొటో. పరప్పన అగ్రహార జైలులో ఖైదీలకు, విచారణ ఖైదీలకు, మహిళా ఖైదీలను వేర్వేరుగా ఉంచేందుకు అనుగుణమైన నిర్మాణాలు చేపట్టనున్నారు. పరప్పన జైలులో 5,300 మందిని బంధించే సామర్థ్యం ఉంది. జైలుకు సూపరింటెండెంట్, నలుగురు సహాయ సూపరింటెండెంట్లు, 800 మంది అధికారులు, సిబ్బంది పోస్టులు ఉన్నాయి. వీటిలో సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూపరింటెండెంట్, సహాయ సూపరింటెండెంట్లతో కలిపి 400 మంది పనిచేస్తున్నారు. ఖైదీల విభాగానికి అసిస్టెంట్ సూపరింటెండెంట్లు భద్రతా బాధ్యతలు చేపడతారు. ఇలా సిబ్బంది కొరత, పని ఒత్తిడి, భద్రతా లోపానికి కారణాలవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఖైదీలు, విచారణ ఖైదీలు, మహిళా ఖైదీలకు ప్రత్యేక బ్యారక్‌లు ఉన్నాయి. ఆసుపత్రి, డార్మిటరీ, విజిటింగ్ విభాగాలు ఒక్కటిగానే ఉన్నాయి. ఈ విభాగాలకు ఖైదీలు వచ్చినప్పుడు సులభంగా భేటీ అవుతుంటారు. ప్రస్తుతం పరప్పన జైలులో 4,500 మంది ఖైదీలు ఉన్నారు. గతంలో విచారణ ఖైదీల విభాగానికి చీఫ్ సూపరింటెండెంట్, మహిళా ఖైదీల విభాగానికి ఎస్పీస్థాయి అధికారి బాధ్యతలు చూసేవారు. వీరిని డీఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తుండేవారు. ఆసుపత్రి, డార్మిటరీ, విజిటర్స్ బ్లాక్‌లు కూడా వేర్వేరు అవుతాయి. ఇలా మూడు విభాగాలకు భారీగా గోడలు నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. హోంమంత్రితో జరిగే చర్చల తర్వాత కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ

జైళ్లలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తెలిపారు. కేవలం పరప్పన అగ్రహార జైలు మాత్రమే కాకుండా బెళగావి, శివమొగ్గ, బళ్లారి, మంగళూరుతోపాటు అన్ని ప్రముఖ జైళ్లలోనూ సమగ్ర సదుపాయాలు, కఠిన నిర్ణయాలు తీసుకునేలా కమిటీ నిర్ణయిస్తుందన్నారు.

సంస్కరణల నివేదికకు నాలుగేళ్లు

జైళ్లలో తరచూ చోటు చేసుకుంటున్న వివాదాల నేపథ్యంలో 2020లో ప్రస్తుత మంత్రి హెచ్‌కే పాటిల్ నేతృత్వంలో జైళ్ల సంస్కరణలపై కమిటీ ఏర్పాటు చేశారు. సదరు కమిటీ కొన్ని నెలల్లోనే నివేదిక ఇచ్చింది. గతంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రస్తుతం ఏడాది పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం జైళ్ల సంస్కరణల నివేదికపై ఎటువంటి ప్రక్రియ చేపట్టలేదు. కమిటీ చైర్మన్ హోదాలో హెచ్‌కే పాటిల్ పలు మార్గదర్శకాలను నివేదికలో పొందుపరిచారు. జైళ్లలో స్థితిగతులు, సంస్కరణలకు నాలుగేళ్ల క్రితమే కాకుండా అంతకుముందు పలు కమిటీలు ఏర్పడ్డాయి. 2009లో జైళ్ల సంస్కరణలపై సిఫారసులు ఇచ్చారు. అంతకు ముందు 1978లో ప్రత్యేక మార్గదర్శకాల పుస్తకాన్ని రూపొందించారు. హెచ్‌కే పాటిల్ నేతృత్వంలోని కమిటీ జైళ్లలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, మొబైల్ జామర్లను ఉపయోగించాలని, విచారణ ఖైదీలను హాజరు పరిచేందుకు ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ గదిని ఏర్పాటు చేయాలని, జైళ్లలో మౌలిక సదుపాయాలు పెంచాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలని నివేదికలో సిఫారసు చేశారు. నిషేధిత వస్తువులు, మొబైల్, సిమ్‌కార్డులను జైళ్లలోకి ప్రవేశించకుండా కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలోనూ సూపరింటెండెంట్లు ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు లేదా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని సిఫారసు చేశారు.

హోంమంత్రిని చుట్టుముట్టిన వివాదాలు

- ఒకదాని వెంట మరొకటి.. ● సంచలనాలతో ఉక్కిరిబిక్కిరి

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఏడాది కిందట శాసనసభ ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీతో సిద్దరామయ్య నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వానికి వరుసగా వివాదాలు చుట్టుముడుతున్నాయి. రెండోసారి హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వర్‌కు వివాదాలు చుట్టుముడుతున్నాయి. తరచూ ఏదో ఒక వివాదానికి సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసులో నటుడు దర్శన్ అరెస్టు అయినప్పటి నుంచి నిత్యం వివాదాలు సాగుతూనే ఉన్నాయి. ఏకంగా రౌడీషీటర్లు జైలుకు వెళ్లి రిసార్టు తరహాలో సరదాగా గడిపిన ఫొటోలు, వీడియో కాల్ వైరల్ అయ్యాయి. ప్రతిపక్ష నాయకులతోపాటు ప్రజల నుంచి పరమేశ్వర్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించి పరప్పన జైలులోని 13 మందిని వేర్వేరు జైళ్లకు మార్పు చేశారు. నిజాయితీ, నిష్పక్షపాత అధికారులను జైళ్ల శాఖ డీఐజీగా నియమించారు. మరోవివాదంలో మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ, మాజీ ఎంపీ ప్రజ్వల్, ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ వివాదాలకు సమాధానాలు చెప్పాల్సి వచ్చింది. హాసన్‌లో ప్రజ్వల్‌కు సంబంధించిన రాసలీలల పెన్‌డ్రైవ్‌లు వైరల్ కావడం, ఆ తర్వాత అతడు విదేశాలకు తరలిపోవడం, బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసులో రేవణ్ణను అరెస్టు చేయడం వంటివి కొనసాగాయి. మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించి రూ. 187 కోట్ల అవినీతి వెలుగులోకి రావడంతో సిట్ విచారణ జరపాల్సి వచ్చింది. మంత్రి నాగేంద్రకు క్లీన్‌చిట్ లభించినా పరమేశ్వర్ మాత్రం పలు విమర్శలు ఎదుర్కొన్నారు. హుబ్బళ్లిలో విద్యార్థిని నేహ హిరేమఠ్‌ను కళాశాలలోనే ఫయాజ్ అనే యువకుడు కిరాతకంగా హతమార్చాడు. కాంగ్రెస్ కార్పొరేటర్ నిరంజన్ హిరేమఠ్ సొంతపార్టీ నేతలతోపాటు హోంశాఖ మంత్రిపైనా మండిపడిన విషయం తెలిసిందే. హుబ్బళ్లిలో అంజలి అంబిగెర హత్యకేసు రాజకీయ రంగు పులుముకుంది. శాంతిభద్రతలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వచ్చాయి. సీఎం, మంత్రుల భిన్నమైన వ్యాఖ్యలతో హోంశాఖ మంత్రి సమాధానం చెప్పలేకపోయారు. దేశమంతటా సంచలనం కలిగించిన వైట్‌ఫీల్డ్‌లోని రామేశ్వరం కెఫెలో బాంబుపేలుళ్ల ఘటన రాష్ట్ర ప్రభుత్వానికి మాయనిమచ్చగా మారింది. సీఎం, మంత్రులు ఈ వివాదంలోనూ భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. సీసీబీ ద్వారా దర్యాప్తునకు ఆదేశించగా ఎన్ఐఏ రంగంలోకి దిగడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. విధానసౌధలో రాజ్యసభ సభ్యుడిగా నాసిర్‌హుసేన్ ఎన్నికైన సందర్భంలో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ చేసిన నినాదాలు అన్ని వర్గాల ద్వారా ప్రభుత్వానికి విమర్శలు వచ్చాయి. హోంశాఖ మంత్రి పరమేశ్వర్, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తో పాటు పలువురు నకిలీ వీడియోలంటూ ప్రచారం చేశారు. ఫోరెన్సిక్‌లో వాస్తవమని తేలడంతో విమర్శలకు దారితీసింది. హావేరిలో సామూహిక అత్యాచారం కేసులో రాజీకోసం కొందరి ప్రయత్నాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చాయి. బెళగావి జిల్లా వంటమూరిలో మహిళను వివస్త్రను చేసి చితకబాదిన సంఘటన జాతీయస్థాయిలో విమర్శలకు దారితీసింది. ఉడుపి కళాశాలలో విద్యార్థినుల వీడియోల చిత్రీకరణలోనూ హోం మంత్రికి తలదించుకునేలా చేసింది. తాజాగా ముడా వివాదం తలెత్తిన తర్వాత బీజేపీ, జేడీఎస్‌లకు చెందిన నేతలపై పాతకేసులను తిరగతోడే ప్రయత్నం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తోంది.



నగరంలోని ఆర్సీ కాలేజ్ వద్ద అభ్యర్థులు

ప్రశాంతంగా కేపీఎస్‌సీ పరీక్షలు

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్‌సీ) ఆధ్వర్యంలో గెజిటెడ్ ప్రొబేషనర్స్ గ్రూప్ ఏ, బీ పోస్టుల కోసం రాజధాని బెంగళూరు నగరం సహా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని ప్రముఖ కళాశాలల్లో జనరల్ స్టడీస్-1 ఉదయం 10-12 గంటలకు, జనరల్ స్టడీస్-2 పరీక్ష మధ్యాహ్నం 2-4 వరకు సాగింది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడి నిర్వహిస్తున్న పరీక్షలు కావడంతో ముందస్తు చర్యలో భాగంగా పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల మేర ఆంక్షలు విధించారు. బెళగావిలో అంజుమన్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ రోషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎంఆర్ షీట్లను 15 నిమిషాలు ఆలస్యంగా ఇవ్వడంపై అభ్యర్థులు నిరసన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. పలు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ముందుగానే చేరుకుని పుస్తకాలను తిరగేయడం కనిపించింది.



పరీక్షా కేంద్రం బయట విద్యార్థులు

సిద్దరామయ్యపై కుట్ర

- బీసీ సంఘాల కూటమి నాయకుల ఆగ్రహం ● సీఎంకు మద్దతుగా చలో రాజ్‌భవన్‌కు యత్నం ● అడ్డుకున్న పోలీసులు ● ఫ్రీడం పార్కులో నిరసన



ఫ్రీడంపార్కులో నిరసన



సంగొళ్లిరాయణ్ణ విగ్రహం వద్ద..

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో కుట్రతోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారని బీసీ సంఘాల కూటమి విమర్శించింది. సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతులను నిరసిస్తూ బీసీ సంఘాల కూటమి మంగళవారం 'చలో రాజ్‌భవన్' చేపట్టింది. ఫ్రీడం పార్కులో భారీ బహిరంగసభ నిర్వహించింది. కేంద్రప్రభుత్వం, గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు స్పష్టమైన మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆశీస్సులు అందించారని అన్నారు. సీఎంను ఇబ్బంది పెట్టాలనే కుట్రలో భాగంగానే విచారణకు అనుమతులు ఇచ్చారని మండిపడ్డారు. గవర్నర్ వెంటనే అనుమతులను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్రీడం పార్కు నుంచి ర్యాలీగా రాజ్‌భవన్‌కు తరలేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సీనియర్ న్యాయవాది రవివర్మకుమార్, కూటమి అధ్యక్షుడు రామచంద్రప్ప, సంచాలకులు మావళ్లి శంకర్, ఎణ్ణెగెరె వెంకటరామయ్య, ఆదర్శ్ ఎల్లప్ప, అనంతనాయక్, మాజీ మంత్రి లలితానాయక్, ఎమ్మెల్సీ నాగరాజ్‌యాదవ్, బీమానాయక్, వినయ్‌కుమార్ సొరకె తదితరులు పాల్గొన్నారు.

జయదేవలో నిరంతర సేవలు

- మరింత వైద్య సిబ్బంది కేటాయిస్తాం ● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జయదేవ హృద్రోగ ఆసుపత్రిలో 24 గంటలపాటు సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది, నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు ప్రైవేట్ డాక్టర్లకు ఏమాత్రం తీసిపోరని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్‌కు ధీటుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గాంధీనగర్ నియోజకవర్గంలోని కేసీ జనరల్ ఆసుపత్రిలో తల్లీబిడ్డల విభాగం, బోధనా విభాగం, మార్చురీ భవనం, మాదిరి వంట భవనం, లాండ్రి, మెడికల్ వేస్టేజ్ విభాగాలకు మంగళవారం లాంఛనంగా భూమిపూజ చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జయదేవ ఆసుపత్రిలోని స్వచ్ఛత ఇతర ఆసుపత్రులకు ఆదర్శం కావాలని తెలిపారు. అప్పుడే ప్రభుత్వ గ్రాంట్లకు సార్థకత సాధ్యమవుతుందన్నారు. ఇదే సందర్భంగా వేదికపై నుంచి జయదేవ ఆసుపత్రి డైరెక్టర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించి ఇకపై 24గంటలు సేవలందించేందుకు తగిన రీతిలో సిద్ధం చేసుకోవాలని తెలిపారు. తనతో సహా మంత్రులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లకపోవడం తమ తప్పు కూడా ఉందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నాణ్యత, [illegible]త ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా కొనసాగేలా తగిన నిధులు ఇస్తూనే ఉన్నామన్నారు. ఆసుపత్రి పాలకవర్గం [illegible]ణికంగా విధులు నిర్వహించి సేవలందిస్తేనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రమాదాల జోన్‌లకు సమీపంలో [illegible] సెంటర్లను తెరిచేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, గాయపడినవారిని కాపాడాలంటే గోల్డెన్ అవర్‌లోగా చేర్చడం [illegible] ప్రధానమని, అందుకే ప్రభుత్వం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. తాను బడ్జెట్‌లో పేర్కొన్న అన్ని కార్యక్ర[illegible] జారీ చేసేందుకు వేదికపై ఉన్న ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి హర్షగుప్త చొరవ చూపాలని సూచించారు. ఆరో[illegible] మంత్రి దినేశ్‌గుండూరావు డిమాండ్ల మేరకు గ్రాంట్లు విడుదల చేశామని, నూతన ఆసుపత్రులను తానే ప్రారంభి[illegible] సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రికి సూచించారు. జనవరి 22న నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన [illegible]రకు ప్రస్తుతం భూమిపూజ చేస్తున్నట్టు తెలిపారు. రోగుల సమస్యలను సంయమనంతో ఆలకిస్తే రోగాలను సగం [illegible]సేందుకు వీలవుతుందనే నానుడి ఉందన్నారు. ఆ దిశగా వైద్యులు చక్కటి సేవలందించాలని సూచించారు. కార్య[illegible] ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆరోగ్యశాఖ మంత్రి గుండూరావు, చలనచిత్ర అకాడమీ అధ్యక్షుడు సాధుకో[illegible]టీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు


ఉల్లి రైతు కన్నీరు



- అధిక వర్షాలతో కొట్టుకుపోయిన పంట ● మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న ధరలు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 27: మార్కెట్‌లో ఉల్లి ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో వినియోగదారుల కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ. 70కు పైగానే పలుకుతుండడంతో కొనలేక ఒకవైపు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సాగుచేసిన ఉల్లిపంట చేతిక అందక పోగా.. కళ్లెదుటే చేతికొచ్చిన పంట నేలరాలుతుండడంతో రైతుల కళ్లలో నీళ్లు వస్తున్నాయి. దీంతో ఉల్లిసాగుకు పెట్టిన పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోగా చేసిన అప్పుల భారంతో రైతులు తల్లిడిల్లి పోతున్నారు. చిత్రదుర్గ జిల్లా పరిధిలో ప్రధాన వాణిజ్య పంటగా రైతులు ఉల్లిని సాగు చేస్తుంటారు. మార్కెట్‌లో ఉల్లికి డిమాండ్ ఉండడంతో జిల్లా పరిధిలోని పలు తాలూకాలో వేలాది హెక్టార్లలో పంట సాగు చేశారు. వర్షాలు ఎక్కువ కాడడంతో పాటు మేఘావృతమైన వాతావరణం కారణంగా ఉల్లిగడ్డలు భూమిలోనే కుళ్లిపోయి రైతుల చేతికి అందకుండానే మట్టిలో కలిసిపోయే స్థితికి చేరుకుంది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. జిల్లా పరిధిలోని చెళ్లకెర తాలూకా నాయకనహట్టి ప్రాంతంలో వందలాది హెక్టార్లలో ఉల్లిని సాగు చేశారు. అధిక వర్షం కారణంగా ఉల్లి మడుల్లోనే వేర్లు కుళ్లిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది అధిక లాభాలు పొందవచ్చని బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తులతో తీసుకొచ్చిన అప్పులు నెత్తిన పడే పరిస్థితి నెలకొందని నాయకనహట్టి రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉల్లి పంటకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.








భూమిపైన తేలిన ఉల్లిగడ్డలు





అధిక వర్షాల కారణంగా ధ్వంసమైన ఉల్లిపంట



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.29	1,625.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	20,956	409
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,169	7,030
సామర్థ్యం (టీఎంసీలు)	87.78	79.70

క్రీడలతో ఆరోగ్యం



జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దారు

కంప్లి, ఆగస్టు 27: విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్ శివరాజ్‌కుమార్ తెలిపారు. కంప్లిపట్టణంలోని సత్యనారాయణ పేట పాఠశాలలో వలయ-1 ప్రాథమిక పాఠశాలలో క్రీడలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందుకొస్తేనే మరింత గుర్తింపు వుంటుందన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఇతర క్రీడల్లో తాలుకా స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి జిల్లా స్థాయిలో ప్రథమస్థానం దక్కించుకుని గుర్తింపు పొందాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా వుండాలన్నారు. అప్పుడే ఆరోగ్యంతోపాటు చదువుకున్న విద్య కూడా గుర్తింపునిస్తుందన్నారు. ఈ క్రీడల్లో 33 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగన్నగౌడ, వెంకటరమణ, బసవరాజు, రాజశేఖర్, పండితారాధ్య సీఆర్పీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బళ్లారిరూరల్, ఆగస్టు 27: బళ్లారి నగరం మోకా రోడ్డు వాజ్‌పేయి లేఔట్‌లో నివసిస్తున్న లింగన్న కుమారుడు మంజునాథ్ (32) ఇంట్లో సింటెక్స్‌కు నీరు ఎక్కిస్తుండగా విద్యుదాఘాతంతో మరణించాడు. విద్యుత్ షాక్ తగిలిన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు బళ్లారికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై బళ్లారి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జిందాల్‌కు భూమి అమ్మకం న్యాయ నిర్ణయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కేసీ కొండయ్య

బళ్లారి సిటీ, ఆగస్టు 27: సండూరు తాలూకాలోని తోరణగల్లు జిందాల్ కంపెనీకి 3.677 ఎకరాల భూమిని విక్రయించడం న్యాయ విజయం అని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు కేసీ కొండయ్య అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో లీజ్ కమ్ సేల్ పద్ధతిలో భూమిని ఇచ్చారన్నారు. లీజు గడువు ముగిసిన తర్వాత విక్రయించాల్సి ఉందన్నారు. తాజాగా కోర్టు కంపెనీకి అనుకూలంగా తీర్పునిచ్చిందని, దీనిప్రకారం భూమిని విక్రయించాల్సిందేనన్నారు. ఇందులో అవినీతి ఉందని అరవింద బెల్లాద్ బయటి వ్యక్తులతోపాటు సంఘాలు, సంస్థలు బళ్లారి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ఎవరైనా డాక్యుమెంట్లు చూసి మాట్లాడాలన్నారు. మొదట్లో ఉత్పత్తి ఏడాదికి 1.5 లక్షల టన్నులు ఉండగా.. ప్రస్తుతం అది 27లక్షల టన్నులకు పెరిగిందన్నారు. దీన్ని నమ్ముకుని 30స్పాంజ్ ఐరన్ కెంపెనీలు ఉన్నాయనీ, 10-12 వాషింగ్ యూనిట్లు ఉన్నాయని అన్నారు. వారిలో చాలామందికి ఉద్యోగాలు లభించాయని ఆయన పేర్కొన్నారు. ఇతర ఫ్యాక్టరీలు రావడానికి ఇక్కడ అనుబంధ వ్యవస్థలేదని, కాబట్టి జిందాల్‌కు మద్దతివ్వాలన్నారు.

బైక్‌ను తప్పించబోయి బస్సు బోల్తా



బోల్తాపడిన ప్రైవేటు బస్సు

బళ్లారి రూరల్, ఆగస్టు 27: మోకా, ఎర్రగుడి సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద ఓ ట్రావెల్స్ బస్సు మంగళవారం ఆదోని వైపు వెళుతూ ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడ్డ వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై మోకా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏకగ్రీవంగా పంచాయతీ ఎన్నికలు



కుడితినిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఎంపీ తుకారామ్



బాదనట్టిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఊరేగిస్తున్న ప్రజలు

కంప్లి, ఆగస్టు 27: కుడితిని పట్టణ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల సమావేశానికి 19 మంది సభ్యులకు గాను 17 మంది హాజరయ్యారు. అధ్యక్షస్థానం జనరల్‌కు కేటాయించగా, ఆ స్థానానికి 7వ వార్డు నుంచి బసమ్మ, ఉపాధ్యక్షస్థానం ఎస్సీ వర్గానికి రిజర్వ్ కావడంతో కనికేరి పంపావతి నామినేషన్లు వేశారు. వీరికి ఎవరూ పోటీ లేనందువలన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గురురాజు, తీర్థప్రసాద్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను బళ్లారి ఎంపీ ఈ తుకారామ్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ తుకారామ్ మాట్లాడుతూ రెండవ విడత అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలను సండూరు, కురేకుప్ప, కుడితినిలో తమ పార్టీనే కైవసం చేసుకుందన్నారు. అందరూ ఐక్యతతో ముందుకెళుతూ పట్టణ అభివృద్ధికి ముందుకు రావాలని సూచించారు. త్వరలోనే కుడితినిలో 30 పడకల ఆస్పత్రికి భూమిపూజ చేపడతామన్నారు. అలాగే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను కూడా అక్టోబరులోగా పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. రింగ్ రోడ్డు పనులకు అదనంగా రూ.మూడు కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ సభ్యులు కూడా అధ్యక్షఉపాధ్యక్షులను పూలమాలలతో అభినందించారు.

బాదనట్టిలో ఏకగ్రీవం

కురుగోడు తాలుకా పరిధిలోని బాదనట్టి గ్రామంలో గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగాయి. 22 మంది సభ్యులు వుండగా 14 మంది హాజరయ్యారు. అందులో అధ్యక్ష స్థానానికి కరియప్ప, ఉపాధ్యక్ష స్థానానికి కరిబసమ్మ నామినేషన్ వేశారు. వీరికి ఎవరూ పోటీలో లేనందున వారినే అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నిర్మల తెలిపారు. అనంతరం గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వారితో పాటు పీడీవో రామాలి, గాదెలింగప్ప, శివమ్మ, నిర్మల, మంజునాథ్, హనుమంతమ్మ, ఉమ, కాళమ్మ, మెట్రి సిద్దేష్ పాల్గొన్నారు.

రైతులకు భారంగా వరిసాగు

● ఎకరాకు పెట్టుబడి రూ.35 వేలు.. ఆదాయం రూ.40 వేలు

బళ్లారి, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడులు భారంగా మారాయి. ఆయకట్టు భూముల్లో వరి నాటేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి నారు, వ్యవసాయ కూలీలు, ఎరువులు, మందులు, ఇలా అన్నింటికీ రేట్లు పెరగడం వల్ల పరిస్థితి ఇబ్బంది కరంగా మారింది.

తుంగభద్ర డ్యాం కింద కొప్పళ, బళ్లారి, రాయచూరు, జిల్లాల పరిధిలో వివిద కాలువల కింద 3లక్షల హెక్టార్ల వరకూ ఆయకట్టు భూమి ఉంది. ఇందులో ఎక్కువగా రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది డ్యాంలోకి అనుకున్న సమయానికి నీరు చేరుకున్నా, ఆగస్టు 10న క్రస్ట్ గేటు కొట్టుకుపోయి నీటి విడుదలలో కొంత ఆలస్యం జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డ్యాం తిరిగి నీటితో కళకళలాడుతుండడంతో కాలువలకు కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. బోర్ల కింద వరి నారు పెంచుకున్న రైతులు నాట్లు త్వరగా వేసుకోవాలని ఆతృతపడుతున్నారు.

ఒక ఎకరాలో నాటు వేయడానికి ఏకంగా రూ. 5 వేల నుండి 6వేల వరకూ ఒప్పందం ఇస్తున్నారు. అదే కూలీ అయితే ఒకరికి రూ.600 వరకూ



నాటడానికి వీలుగా పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు



ఏపుగా పెరిగిన వరినారు మడి

పలుకుతుంది. చాలా వరకూ వరి నాట్లు వేయడానికి ముఠాలకు ఒప్పందానికి ఇస్తున్నామని రైతులు తెలిపారు. తుంగభద్ర డ్యాం కింద ఉండే ఆయకట్టు భూముల్లో ఒకేసారి నాట్లు వేసుకునే సమయం రావడంతో కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. అవసరానికి తగ్గట్టుగా కూలీలు దొరకడం లేదు. వీటికి తోడు ఇతర పెట్టుబడులు కూడా పెరిగాయి. ఎరువులు, మందులు, సేద్యం పనులు కూడా రేట్లు బాగా పెరిగాయి. ఎకరాలో ట్రాక్టర్ ద్వారా దమ్ము చేసేందుకు గంటకు రూ. 15వందల వరకూ అవుతోంది. ఇలా ప్రతి పనకీ రేట్లు రెట్టింపు అయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు ఎకరాలో పంట బాగా పండితే సరాసరి 35నుండి 40 మూటల ధాన్యం పండుతుంది. బస్తా అంటే 75 కిలోలు వస్తాయి దీని ప్రకారం సరాసరి 28 క్వింటాళ్లు పండినట్లు. దీన్ని అమ్మితే 40 వేలకు మించి రాదు. కాని ఎకరా పెట్టుబడి సరాసరి రూ. 30 వేల నుండి 35వేల వరకూ అవుతోంది. ఇక కౌలు దారులకయితే ఏమీ మిగలదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన కూలీల రేట్లు పెట్టుబడులతో ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు రైతు కేంద్రాల నుండి కొనుగోళ్ల చేసిన ధాన్యానికి ఇంత వరకూ ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని గంగావతి, సిరుగుప్ప, బళ్లారి, కంప్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లారీల బాడుగ పెంచకపోతే నిరసన

కంప్లి, ఆగస్టు 27 :కుడితిని వద్ద వున్న స్పాంజ్‌ఐరన్ ఫ్యాక్టరీలకు సరుకు రవాణా చేసే లారీలకు బాడుగను నాలుగు శాతం పెంచకపోతే తాము నిరసన చేయక తప్పదని కుడితిని లారీ సంఘం అధ్యక్షులు శివశంకర్ తెలిపారు. సోమవారం వేణీవీరాపురం వద్ద హరిగిణదోణికి వెళ్లే రోడ్డుమార్గంలో లారీ యజమానులు, నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కుడితిని అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఓతూరు, అగర్వాల్, పద్మావతి స్టీల్స్, శాతవాహన, రయాన్, ఏసీసీ, పవమాన్ ఫ్యాక్టరీలు ఒక్క టన్నుకు రూ. 1050 ఇస్తున్నారని, కొన్ని రోజుల క్రితమే జిల్లా పోలీసు శాఖ అధికారులతో బాడుగలు పెంచాలని చర్చించగా, అక్కడ అధికారుల సమక్షంలోనే బాడుగ పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు ఎలాంటి బాడుగ పెంచలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తక్కువ రేట్లకే రవాణా చేసే వేరే రాష్ట్రాల నుంచి వచ్చిన లారీలకే అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ స్థానికులకు బాడుగలు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వడం తగదన్నారు. స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకోకుండా పొరుగువారికి అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే ఈఎంఐల పై తెచ్చుకున్న లారీలకు కంతులు కట్టలేకపోవడంతో ఫైనాన్స్ వారు లారీలను తీసుకెళుతున్నారన్నారు. ఇక్కడ 90 లారీలు వుండగా ఇప్పటికే 15 లారీలకు ఈఎంఐలు చెల్లించకపోవడంతో వాటిని తీసుకెళ్లారన్నారు.



మాట్లాడుతున్న లారీల యూనియన్ అధ్యక్షుడు శివశంకర్

ఇలాగే కొనసాగితే రాష్ట్ర అధ్యక్షులు షణ్ముఖప్ప ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ప్రతిఘటనలు తప్పవని హెచ్చరించారు. వారితో పాటు మహేష్, నాగేష్, ప్రతాప్, శివకుమార్, స్వామి, రఘు, గంగాధర, సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్ప నగర అధ్యక్షస్థానం కాంగ్రెస్ కైవసం



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, ఆగస్టు 27: సిరుగుప్ప నగరసభ అధ్యక్షస్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అధ్యక్షురాలిగా రేణుకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరుగుప్ప పట్టణంలో మంగళవారం తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష స్థానానికి రేణుకమ్మ నామినేషన్ దాఖలు చేయగా, ఉపాధ్యక్ష స్థానానికి యశోద నామినేషన్ దాఖలు చేశారు. రెండు పదవులకు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేసినందున వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు అధ్యక్ష, ఉపాధ్యక్షులను పూలమాలలతో సన్మానించారు. నగరఅభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి, టపాసులు పేల్చారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నగరసభ కమీషనర్ గురుప్రసాద్, మాజీ అధ్యక్షులు బీఎం సతీష్, ముత్యాలయ్య శెట్టి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య, కాంగ్రెస్ నాయకులు సన్నా వెంకటేష, చిదానంద, కౌన్సిలర్లు గణేష్, నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్ మెహ్రోజ్ ఖాన్

బళ్లారి సిటీ, ఆగస్టు 27: హామీ పథకాలను సక్రమంగా అందజేసేందుకు అథారిటీ అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని హామీ పథకాల అమలు ప్రాధికార సంస్థ కలబురగి డివిజన్ వైస్ చైర్మన్ మెహ్రోజ్ ఖాన్ అన్నారు. నగరం కోట ప్రాంతంలోని జిల్లాపంచాయితీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన హామి పథకాల ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హామీ పథకాలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. విద్యార్థులు, గృహిణులు, విద్యుత్ వినియోగదారులు, యువతకు భరోసాపథకాలు అందుతున్నాయన్నారు. హామీ పథకం అనేది పార్టీలకతీతంగా అమలుజరుగుతున్న ప్రజానుకూలమైన సామాజిక కార్యక్రమన్నారు. అర్హులైన ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. రానున్న రోజుల్లో 100శాతం ఈ పథకాలను అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. గృహలక్ష్మి యోజన కింద 2,77,494మంది నమోదు చేసుకున్నారని, ఇందు కోసం రూ.601కోట్ల ఖర్చు చేసినట్లు తెలిపారు. అర్హులైన ఇతర రేషన్ కార్డుదారులు కూడా గృహలక్ష్మి యోజనలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని మహిళా శిశు అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు తెలిపారు. శక్తి యోజన కింద 2.84కోట్లమంది లబ్దిదారులు ప్రయాణించగా రూ. 110కోట్లు ఖర్చు అవతోందన్నారు. జిల్లాలో 3,02,898 మంది అర్హులైన విద్యుత్ వినియోగదారులు ఉన్నారని, గృహ జ్యోతి యోజన కింద 2,74,775 మంది వినియోగదారులు నమోదు చేసుకోగా 1.20కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈసందర్భంగా హామీ పథకాల అమలు సంస్థ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆశాలతసోమప్ప, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, వివిధ శాఖల అధికారులు, హామీ పథకాల అమలు సంస్థ కార్యాలయ అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ,ఆగస్టు 27: జిల్లాలోని ప్రతి గ్రామంలో ఆరోగ్య పరీక్షా శిబిరాలను నిర్వహించాలని జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అన్నారు. జిల్లా పంచాయితీ హాల్లో మంగళవారం పంచాయితీరాజ్ శాఖ, మైసూరులోని అబ్దుల్ నజీర్‌సాబ్ స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన గ్రామ ఆరోగ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తపోటు, మధుమేహం, క్షయ, మానసిక ఆరోగ్యం, పోషకాహార లోపం, రక్తహీ నత రోగులకు చికిత్సచేయడంద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పనిచేయాలన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎర్రగుడి పాఠశాల జట్టు



ఎంపికైన ఎర్రగుడి మొరార్జీ పాఠశాల విద్యార్థులు

బళ్లారి రూరల్, ఆగస్టు 27: తాలుకా కబడ్డీ క్రీడాపోటీల్లో విజయం సాధించిన ఎర్రగుడి మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనటు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ బసప్ప స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

హోసూరు ఆగస్టు 27: క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల తరపున ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతి సంవత్సరం తమిళనాడు ప్రభుత్వ క్రీడా విభాగం తరపున విద్యార్థులకు క్రీడా పోటీలు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం బాగలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు హోసూరు ఉత్తర ప్రావిన్స్ పరిధిలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఆగస్టు 22, 23 తేదీల్లో అదియమాన్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలకు చెందిన 14 ఏళ్లలోపు 29 మంది విద్యార్థులు క్రీడా పోటీలో పాల్గొన్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రాజ్ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం పొందారు. 7వ తరగతి విద్యార్థి అరిఫుల్ 200 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ పొన్ నాగేశ్ కూడా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ టీచర్ విజయలక్ష్మిని ప్రధానోపాధ్యాయులు సన్మానించి బహుమతులు అందించారు.

మెట్రో రైల్ సాధ్యాసాధ్యాలపై సమావేశం

హోసూరు ఆగస్టు 27: తమిళనాడు ప్రభుత్వం ఆమోదించిన విధంగా చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్ హోసూరు నుంచి బొమ్మసంద్ర వరకు అత్తిబెలె మీదుగా రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన సాధ్యాసాధ్యాల నివేదికపై మంగళవారం బెంగళూరు మెట్రోరైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్వరరావు చర్చించారు. ఈ కార్యక్రమంలో చెన్నై మెట్రో రైల్ కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ టీ.అర్జునన్, చీఫ్ జనరల్ మేనేజర్ డి.లివింగ్‌స్టోన్ ఎలిజార్ (ప్లానింగ్ అండ్ డిజైన్), బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్, ఆర్.కే.రెడ్డి, చెన్నై, బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ కన్సల్టెంట్స్ బాలాజీ రైల్‌రోడ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హబోగ్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు పాల్గొన్నారు. బొమ్మసంద్రం నుంచి అత్తిబెలె మీదుగా హోసూరుకు వెళ్లే ఈ మార్గం మొత్తం సుమారు 23 కి.మీ. దూరం ఉంటుందని అంచనా వేశారు. తమిళనాడుల్లో 11 కి.మీ.కర్ణాటకల్లో 12 కి.మీ. ఉండే ఈ మార్గంలో 12 మెట్రో స్టేషన్లు ఉంటాయి ఈ ప్రణాళిక అమలయితే హోసూరు బెంగళూరు మధ్య రవాణా కనెక్టివిటీ మెరుగుపడుతుంది.

లైసెన్స్ లేని దుకాణాలకు సీల్

హోసూరు ఆగస్టు 27 : హోసూరు నగరంలో వ్యాపార లైసెన్స్ పొందాలని పలుమార్లు హెచ్చరించినా లైసెన్స్ పొందని 4 దుకాణాలకు మంగళవారం తాళాలు వేసి సీలు వేశారు. హోసూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని పలు అనుమతులు లేని దుకాణాలకు సీలు వేశారు. కార్పొరేషన్‌లో 10 వేలకు పైగా దుకాణాలు కొనసాగుతున్నాయి. రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, బట్టల దుకాణాలు, చిల్లర దుకాణాలు ఇలా అనేక దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికి వ్యాపార లైసెన్స్ లేని దుకాణాలు వేలల్లో ఉన్నాయి. దీనికి సంబంధించి మంగళవారం మున్సిపల్ వెల్ఫేర్ అధికారి ప్రభాకర్ నేతృత్వంల్లో సర్వే జరిగింది. అనుమతులు లేని దుకాణాలకు సీల్ వేసేలా నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ప్రభాకర్ మాట్లాడుతూ లైసెన్స్ పొందాలని పదే పదే ఆదేశాలు ఇచ్చినా లైసెన్స్ పొందకుండా నిర్వహిస్తున్న దుకాణాలకు సీల్ వేసి చర్యలు తీసుకున్నామన్నారు.



దుకాణాలకు సీల్ వేస్తున్న దృశ్యం

ఉచిత చికిత్సతో క్షయవ్యాధి నిర్మూలన

బళ్లారి సిటీ, ఆగస్టు 27: వేల ఏళ్లుగా సమాజంలో పాతుకుపోయిన క్షయవ్యాధి(టీబీ)ని అంతమొందించేందుకు ఉచిత వైద్యం అందుబాటులో ఉందని, సకాలంలో వ్యాధి నయం చేసేందుకు దాతల ద్వారా పౌష్టికాహారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లా క్షయనిర్మూలన విభాగం, జేఎస్‌డబ్ల్యూ పౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చికిత్సపొందుతున్న 1287 మంది రోగులకు అందించిన కిట్‌లను లాంఛనంగా పంపిణీ చేశారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, సాయంత్రం జ్వరం, రాత్రి చెమటలు, కఫంలో రక్తం, ఛాతీ నొప్పి, ఆకలి లేకపోవడం, బరువుతగ్గడం వ్యాధి ప్రధాన లక్షణాలుగా గుర్తించాలన్నారు. క్షయవ్యాధి అని నిర్ధారణ అయితే సమీపంలోని ప్రభుత్వఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలన్నారు. జేయస్‌డబ్ల్యూ పౌండేషన్ అధ్యక్షుడు మురుగన్ మాట్లాడుతూ ప్రస్తుతం క్షయచికిత్స పొందుతున్నవారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి పాల్గొన్నారు.



రోగులకు కిట్లను అందచేస్తున్న కలెక్టర్ మిశ్రా

4న రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళన

రాయచూరు, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరశిస్తూ సెప్టెంబర్ 4వ తేదీన జిల్లాకేంద్రంలో ఆందోళన నిర్వహిస్తామని కర్ణాటక రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు శివపుత్రగౌడ తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లోమంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా రాష్ట్రంలో వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. రైతులు ఏర్పాటు చేసుకున్న పంప్‌సెట్‌లకు ఆధార్‌ను అనుసంధానం చేస్తామని చెబుతున్న తీరు అభ్యంతరకరమన్నారు. ఈ రెండింటిని నిరశిస్తు సెప్టెంబర్ 4న తలపెట్టిన రైతు ధర్నాలో రైతులందరు పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న శివపుత్ర గౌడ

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కీ.శే. శంకరనారాయణ కాలమ్...

చెంబై వైద్యనాథ భాగవతార్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, పద్మభూషణ్ గ్రహీత చెంబై వైద్యనాథ భాగవతార్ 1896 ఆగస్టు 28న జన్మించారు. ఆయన పూర్వీకులు ఐదు శతాబ్దాలకుపైగా కర్ణాటక సంగీతంతో సంబంధం కలిగి ఉన్నారు. తొమ్మిదో యేటనే కచేరీ నిర్వహించిన ఘనత ఆయనది. సంగీతోత్సవాలు, మద్రాస్ మ్యూజిక్ అకాడమీ, జగన్నాథ భక్తిసభ వంటి అనేక సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్మభూషణ్, గాయన గంధర్వ, సంగీతా కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిఖామణి తదితర గౌరవాలు అందుకున్నారు. ఆయన శిష్యులలో కేజే ఏసుదాసు, టీవీ గోపాలకృష్ణన్, పీ లీల మొదలైనవారు ఉన్నారు. వైద్యనాథ భాగవతార్ 1974 అక్టోబరు 16న కన్నుమూశారు.

ఉస్తాద్ విలాయత్‌ఖాన్ (జయంతి)



'భారత సితార్ సామ్రాట్'గా పేరొందిన ఉస్తాద్ విలాయత్‌ఖాన్ 1928 ఆగస్టు 28న అప్పటి తూర్పు బెంగాల్‌లోని గౌరిపూర్‌లో జన్మించారు. సితార్, సుర్‌బెహార్ వాదనలో పేరొందిన ఇనాయత్‌ఖాన్ కుమారుడు. తండ్రి బాటలో శాస్త్రీయ సంగీతంలో రాణించారు. ఇందడ్‌ఖాని ఘరానా శైలిలో ప్రతిభను చాటారు. 50ఏళ్లకుపైగా దేశ విదేశాల్లో ఆలిండియా రేడియోలో ప్రదర్శనలు ఇచ్చారు. 'గాయకి అంగ్' అనే సరికొత్త శైలిని ఆవిష్కరించి అభివృద్ధి చేశారు. అఫ్తాబ్-ఇ-సితార్ పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2004 మార్చి 13న కన్నుమూశారు. 2014లో ఆయన పేరిట ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

భమిడిపాటి కామేశ్వరరావు (వర్ధంతి)



భమిడిపాటి కామేశ్వరరావు (భకారా) 1897 ఏప్రిల్ 28న పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో జన్మించారు. రచయిత, నటుడు, నాటక కర్త. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి అవడంతో పండితలోకం 'హాస్యబ్రహ్మ'గా కొనియాడింది. త్యాగరాజు రచనలను జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుడి భావానికి అనుగుణంగా సమకూర్చుకుని వివరిస్తూ 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. 1958 ఆగస్టు 28న కన్నుమూశారు.

స్వామి చిదానంద (వర్ధంతి)



స్వామి చిదానంద సరస్వతి 1916 సెప్టెంబరు 24న కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జన్మించారు. యోగి, జ్ఞాని, ఆధ్యాత్మికవేత్తగా దేశంలో పేరొందారు. రిషికేశ్‌లోని డివైన్ లైఫ్ సొసైటీకి గురువు శివానంద సరస్వతి పరమపదించిన అనంతరం అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన అసలు పేరు శ్రీధర్ రావు. చెన్నైలోని లయోలా కళాశాలలో డిగ్రీ అందుకున్నారు. 1943లో రిషికేశ్‌లోని ఆశ్రమంలో చేరి 1949లో గురుపూర్ణిమ రోజున సన్యాసదీక్ష స్వీకరించారు. పతంజలి యోగా సూత్రాలతో యోగాను విస్తృతం చేశారు. 2008 ఆగస్టు 28న కన్నుమూశారు. ఆయన శతజయంతిన 2016లో ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ఆర్ బాలసరస్వతీదేవి (పుట్టినరోజు)



రావు బాలసరస్వతీదేవి 1928 ఆగస్టు 28న మద్రాసులో జన్మించారు. పాత తరం తెలుగు సినీ నటి, నేపథ్యగాయని. లలిత సంగీతసామ్రాజ్ఞిగా ఆమె పేరొందారు. సంగీత కార్యక్రమాలలో ఆమె కంఠం తెలుగువారికి సుపరిచితం. 1944లో మద్రాస్ ఆకాశవాణి రేడియోకేంద్రంలో, 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కూడా ఈవిడ లలిత సంగీత కార్యక్రమాలతోనే ప్రారంభమయ్యాయి. సినిమాలలో నేపథ్యగాయనిగా ఆమె తెలుగువారికి ఎంతో ప్రీతి పాత్రురాలు. ఆరవ యేట ప్రారంభమైన ఆమె గాత్ర మాధుర్యం 60వ యేట కూడా తగ్గలేదు. పలు సినిమాలలో నటించారు. సంగీత దర్శకులు ఎస్ రాజేశ్వరరావుగారితో కలసి లలిత గీతాలు ఆలపించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, సింహళ భాషల్లో సుమారు 2వేల పాటలు పాడారు. రామినేని ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు.

ఏపీ కోమల (పుట్టినరోజు)



ఆర్కాట్ పార్థసారథి కోమల 1934 ఆగస్టు 28న మద్రాసులో జన్మించారు. దక్షిణ భారత నేపథ్య గాయని. 1950, 60 దశకాలలో తమిళ, మలయాళం, తెలుగు భాషల్లో అనేక పాటలు పాడారు. రేడియో కళాకారిణి. 'క్లాసికల్ జీనియస్' కీర్తించబడిన గాత్రం ఆమెది. ఎన్టీఆర్ స్థాపించిన ఎన్ఏటీ బ్యానరులో ప్రతి చిత్రానికి ఆరంభగీతం ఆలపించిన మధురస్వరం ఆమెది. ఆలిండియా రేడియోలో గానలహరి కార్యక్రమంలో విద్యార్థినిగా పాల్గొన్నారు. అక్కడ పని చేస్తుండగానే సినిమాల్లో పాడే అవకాశం వచ్చింది. 1946లో చిత్తూరు వీ నాగయ్య తీసిన 'త్యాగయ్య'లో తొలిసారిగా సినిమా పాట పాడారు. క్షేమామణి, తమిళ్ ఇసైవాణి, అమృతగాన వర్షిణి వంటి బిరుదులు పొందారు.

మాజీ ఎమ్మెల్యే తీరుకు ఉద్యోగుల నిరసన



పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

చింతామణి, ఆగస్టు 27: తహసీల్దార్ కేఆర్ సుదర్శన్ యాదవ్ పట్ల ఏకవచనంతో వ్యాఖ్యానించడమే కాక పరుషంగా వ్యక్తిగత నిందన చేసిన మాజీ ఎమ్మెల్యే ఎం కృష్ణారెడ్డి తీరును ఖండిస్తూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మంగళవారం మౌన ప్రదర్శన చేపట్టింది. అనంతరం చిక్కబళ్ళాపుర ఉపవిభాగాధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈనెల 24న మాజీ ఎమ్మెల్యే ఎం కృష్ణారెడ్డి తమ భవనంలో మీడియాతో మాట్లాడుతున్న వేళ తహసీల్దార్ పట్ల ఏకవచనంతో సంబోధించి, ఇష్టం వచ్చినట్టుగా వ్యక్తిగత నిందనలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. పట్టణంలోని అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులు ప్రవాసిమందరం వద్దకు చేరుకుని ర్యాలీగా పీసీఆర్ సర్కిల్ వరకు సాగారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తదుపరి చిక్కబళ్ళాపుర ఉప విభాగాధికారి అశ్విన్‌కు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, తాలూకా పంచాయతీ ఈఓ ఆనంద్, బెస్కాం ఏఈఈ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై చైతన్యం కలిగించండి



బ్యాంకర్ల కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకంపై చైతన్యం కలిగించి ఆ సమాజంలో వివిధ వృత్తిదారులకు రుణ సౌలభ్యం కల్పించాలని ఎస్ఎల్‌బీసీ జనరల్ మేనేజర్, కెనరాబ్యాంకు సీనియర్ అధికారి కేజే శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. నగరంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం, కర్ణాటక ఫైనాన్స్ సర్వీసెస్ విభాగం శాఖ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సభ జరిగింది. కేఎస్‌డీసీ ఈడీ సుమతి, ఎస్ఎల్‌బీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ పార్శ్వనాథ్ పర్యవేక్షించారు. ఎస్ఎల్‌బీసీ కర్ణాటక జనరల్ మేనేజర్ ఎం భాస్కర్ చక్రవర్తి ముఖ్యులు పాల్గొన్నారు. కేజే శ్రీకాంత్ మాట్లాడుతూ జౌళి, వాస్తుశిల్పాలకు పేరొందామన్నారు. దేశ సంస్కృతిని చాటేలా శిల్పాలు, ఆలయాలు ఉన్నాయన్నామన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి కంసాలిలు, అక్కసాలిగలు, కుమ్మర, బడిగె, శిల్పులు తమ చేతివృత్తుల ద్వారా జీవనాలు సాగిస్తున్నారు. వీరందరూ పథకానికి అర్హులన్నారు. రీజనల్ మేనేజర్ షేక్ మహమూద్, వెంకటేశ్, డాక్టర్ కే సాక్రాటీస్, సీబీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. దేశంలోనే అత్యధికమందికి పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు చేయాలని తీర్మానించారు.

అలరించిన చిన్నికృష్ణుల వేషధారణ



శిడ్లఘట్టలో చిన్నికృష్ణులు

శిడ్లఘట్ట, ఆగస్టు 27: కృష్ణాష్టమిని పురస్కరించుకుని శిడ్లఘట్ట పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా పలుచోట్ల చిన్నికృష్ణుల వేషధారణలో పిల్లలు ఆకట్టుకున్నారు. ఆలయాలలో విశేష పూజలు కొనసాగగా మరికొన్నిచోట్ల సముదాయభవనాలు, పాఠశాలల్లో చిన్నికృష్ణుల వేషధారణ కార్యక్రమాలు సాగాయి. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాసోహం నిర్వహించారు. పలు పాఠశాలల్లో రాధాకృష్ణుల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. విశేషపూజల్లో ఎమ్మెల్యే రవికుమార్, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, కాంగ్రెస్ ప్రముఖులు ఆంజనప్ప, రాజీవ్‌గౌడ, బీజేపీ ప్రముఖులు సీకల్ ఆనంద్‌గౌడ, జేడీఎస్ ప్రముఖులు,



పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శన

తాలూకా యాదవ సముదాయ కమిటీ అధ్యక్షుడు అశ్వథ్‌నారాయణ్, తాజా మాజీ అధ్యక్షుడు కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలాలకు భగవద్గీత అన్వయం

బాగేపల్లి: శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత ద్వారా అందించిన సందేశాలు అన్ని కాలాలకు అన్వయించేలా ఉన్నాయని తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి అభిప్రాయపడ్డారు. తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి, తాలూకా పంచాయతీ, జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, పురసభ, తాలూకా యాదవ కులస్తుల ట్రస్టు సహకారంతో ఏర్పాటైన శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. వేల సంవత్సరాలక్రితమే బోధించిన భగవద్గీతలో మనిషి జీవన విధానం, పాలనా వ్యవస్థ సందేశాలు ఉన్నాయన్నారు. విదేశీయులు సైతం శ్రీకృష్ణుడి తత్వ సందేశాలకు ఆకర్షితులయ్యారన్నారు. బీఈఓ వెంకటేశప్ప మాట్లాడుతూ అధర్మం పోరాడేందుకు అవతరించిన శ్రీకృష్ణ పరమాత్ముడు మానవాళి కోసం భగవద్గీత అందించారన్నారు. యాదవసంఘం అధ్యక్షుడు రామ కృష్ణ, న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు నంజుండప్ప, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆర్ వర్ధి, శివప్ప, టి. రామదాస్, తదితరులు పాల్గొన్నారు.



సర్జాపుర హోబళిలో చిన్నారులు ఇలా...

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో...

దొమ్మసంద్ర: సర్జాపుర హోబళి కత్రిగుప్పె గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ వర్తూరు విభాగం ఆధ్వర్యంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 150 మంది చిన్నారులు రాధాకృష్ణ వేషధారణలో పాల్గొన్నారు. నవరస భరతనాట్య క్లాస్ అకాడమీ ఆర్ఫ్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. విశ్వహిందూ పరిషత్ కర్ణాటక దక్షిణ విభాగం ప్రముఖులు శ్రీధర్ శ్రీనివాస్, భజరంగ్‌దళ్ సంయోజకులు ఎల్లారెడ్డి, శ్రీకృష్ణ, చంద్రశేఖర్, గిరీశ్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్‌కు చెందిన దీక్షిత్, కత్రిగుప్పెకు చెందిన సౌజన్యఫైనాన్స్ శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబణ్ణ, హరీశ్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజయపుర ప్రగతి పాఠశాలలో చిన్నికృష్ణులు

నెబ్రాస్కా గవర్నర్ నిర్ణయంపై తెలుగు సమితి హర్షం



గుర్తింపుపత్రాన్ని చూపుతున్న ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను అమెరికాలోని నెబ్రాస్కా గవర్నర్ జిమ్ పిల్లెన్ కార్యాలయం అధికారికంగా గుర్తించడాన్ని నెబ్రాస్కా తెలుగు సమితి హర్షం వ్యక్తం చేసింది. అక్టోబరు 28 నుంచి నవంబరు 2వరకు దీపావళి వారంగా ప్రకటించింది. నెబ్రాస్కా రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు నెలను హిందూ వారసత్వ మాసంగాను గుర్తించారు. హిందూ సాంస్కృతిక సనాతన ధర్మం, ఆచారాలను సంరక్షించడానికి వేడుకలు జరుపుకోవడానికి అమెరికాలోని భారతీయ హిందూ సమాజం కొనసాగించిన కృషితో గుర్తింపు లభించింది. దీపావళి విశిష్టతను తెలిపిన డాక్టర్ ఫణితేజ అడిదంకు హిందువులు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. మల్లికా జయంతి, కొల్లి ప్రసాద్, నవీన్ కంటెం, వెంకట్ జయంతి, రాజా కోమటి రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రవీణ్ గుమ్మడవల్లి శ్రీపద్ కాంబ్లె, రామకృష్ణ కిలారులు దీపావళి ఉత్సవానికి గుర్తింపు తీసుకురావడంలో ప్రముఖపాత్ర పోషించారని నెబ్రాస్కా తెలుగు సమితి ప్రకటించింది.

వైద్య సేవల్లో నిబద్ధత, నైతికత అవసరం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో ప్రైవేట్ ఆసుపత్రులకు నిబద్ధత, నైతికత అవసరమని ఎంపీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్మన్ సుధామూర్తి అభిప్రాయపడ్డారు. ఎన్‌యూ ఆసుపత్రుల రజత మహోత్సవ వేడుకల్లో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సుధామూర్తి మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహించడం సులభం కాదన్నారు. తాను సమీపంనుంచి గమనించానన్నారు. ఆసుపత్రులలో ఉచిత సేవలు అసాధ్యమని అయితే ధనార్జనే లక్ష్యం కారాదన్నారు. చైర్మన్ వెంకటేశ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల సేవలు కొనసాగించేందుకు ఎందరో సహకారంతోనే సాధ్యమైందన్నారు. యూరాలజిస్ట్, ఎండీ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ 'పేషంట్ సేఫ్టీనెట్' విధానంతో సేవలు అందించామన్నారు, ఎన్ఏబీహెచ్, ఎన్ఏబీఎల్, డీఎన్‌బీల గుర్తింపు పొందామన్నారు.



ఆసుపత్రి రజత మహోత్సవంలో సుధామూర్తి తదితరులు

గణితం పోటీల్లో రాణించిన విద్యార్థులు

శిడ్లఘట్ట, ఆగస్టు 27: తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలైన మేలూరు, చౌడసంద్ర, కంబదల్లి, గంగనల్లి గ్రామాల విద్యార్థులకు గణితాన్ని నేర్చుకునే అభియానలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హైస్కూల్ టీచర్ గాయత్రి, సుజాతల సమక్షంలో గణితం పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మేలూరు పాఠశాలకు చెందిన హరిక, మనోజ్, భావన నిలిచారు. ఐదో తరగతి విభాగంలో వరుసగా భావిక, సహన, మేలూరు పాఠశాల భావన బహుమతులు సాధించారు. నాల్గో తరగతి విభాగంలో కమ్మదహళ్ళి యశ్వంత్, గంగనహళ్ళి పాఠశాల షైదర్, అక్షయ్ గెలుపొందారు. గ్రామపంచాయతీ పీడీఓ శారదా బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు రుక్మిణియమ్మ, సుందరాచారి, రాధమ్మ, గాయత్రి, ప్రకాశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

యూపీఎస్ సాధనపై మిశ్రాకు సత్కారం



శివగోపాల్ మిశ్రాకు సన్మానం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ తరహాలో యునైటెడ్ పెన్షన్ స్కీమ్ అందుబాటులోకి తెచ్చేందుకు సహకరించిన రైల్వే విభాగం కార్మిక నేత శివగోపాల్ మిశ్రాను ఘనంగా సత్కరించారు. సోమవారం సంగొళ్ళిరాయణ్ణ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. 23లక్షలమంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం కలిగేలా యునైటెడ్ పెన్షన్ స్కీమ్ సాధ్యమైందన్నారు. నైరుతి రైల్వే మజ్దూర్ యూనియన్ హుబ్బళ్ళి విభాగం బెంగళూరు డివిజన్ సెక్రటరీ రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి ఉంటామన్నారు. శివగోపాల్ మిశ్రా జాతీయస్థాయిలో కార్మికనేతలతో కలసి కేంద్ర ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపారన్నారు. ఈ ఫలితంగా లక్షలాదిమందికి ప్రయోజనం చేకూరిందన్నారు. శివకుమార్ మిశ్రా మాట్లాడుతూ కార్మికుల జీవనవిధానంలో మార్పులు తీసుకురావాలన్నదే మా ఆశయమన్నారు. కార్మికులు జీవితమంతా పనిచేస్తారని పదవీ విరమణ పొందే నాటికి గ్రాట్యుటీ ఇతరత్రా సౌలభ్యాలు వర్తింపచేయాలనేది ఆశయమన్నారు. కొన్నేళ్ల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. బెంగళూరు డివిజన్ ఉపాధ్యక్షుడు రవి కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

31న ఉట్ల ఉత్సవం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం నాల్గో శనివారం పురస్కరించుకుని వాల్మీకి ఆంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో గరుడ ఫౌండేషన్ సహకారంతో ఉట్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 31న శనివారం సాయంత్రం 6 గంటలకు ఉట్ల ఉత్సవంతో మజ్జిగ కడవతోపాటు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వి.వి.పురం ఫుడ్‌స్ట్రీట్‌లో కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు.

శ్యామ్‌సంగ్ నుంచి ఏఐ వాషింగ్ మిషన్లు

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ఉపకరణాలలో పేరొందిన శ్యామ్‌సింగ్ ఏఐ టెక్నాలజీకి అనుగుణంగా రూపొందించిన పది లార్జ్ కెపాసిటీ వాషింగ్ మిషన్‌లను విడుదల చేశారు. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో డిజిటల్ అప్లయెన్సెస్ డైరెక్టర్ సౌరబ్ బైషాకియ, శ్యామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ సీఈఓ, ఎండీ జేబీ పార్క్, కార్పొరేట్ వైస్‌ప్రెసిడెంట్ రిచర్డ్‌లు పాల్గొన్నారు. సౌరబ్ మాట్లాడుతూ లార్జ్‌స్కేల్ వాషింగ్ మిషన్‌లు అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకురావాలనే మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. 12 కేజీల సామర్థ్యంతో ఫ్రంట్‌లోడ్ వాషింగ్‌మిషన్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు.

పంచాయతీ అధ్యక్షురాలి ఎన్నిక ఏకగ్రీవం

పావగడ, ఆగస్టు 27: పొన్న సముద్రం గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా సిద్ధ గంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన అధ్యక్ష ఎన్నికలకు ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నట్లు ఎన్నికల అధికారి చంద్రశేఖర్ ప్రకటించారు. సిద్ధగంగమ్మ ఎంపిక పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు టీఏ నరసింహయ్య, మహేష్‌బాబు, రెడ్డి ఆనంద్‌గౌడ, శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

అందుబాటులోకి అగరబత్తి మ్యూజియం

బెంగళూరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి అగరబత్తి మ్యూజియం అందు బాటులోకి వచ్చింది. ఉల్లాస్ అగర్బత్తీ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కోణనకుంటె ప్రాంతంలో రూపొందించిన మ్యూజియం ప్రారంభంతోపాటు నిరంతర పేరిట పూజా తైలాన్ని రామ్‌లల్లా విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్ సోమవారం సాయంత్రం లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉల్లాస్ సంస్థ పాలక మండలి సలహాదారుడు ఉల్లాస్‌కామత్ మాట్లాడుతూ ఆధునికత, సుస్థిరతతోపాటు బ్రాండ్ విస్తరణ లక్ష్యంగా భావించామన్నారు. 1978లో ఉల్లాస్ సంస్థ ఆరంభమైందన్నారు. తుమకూరులో అతిపెద్ద అగర్బత్తీ ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 50దేశాలకుపైగా ఎగుమతులు చేస్తున్నట్టు తెలిపారు. దక్షిణాది ప్రముఖ నటి సుహాసినిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్టు తెలిపారు.



పూజాతైలాన్ని ఆవిష్కరిస్తున్న శిల్పి అరుణ్‌యోగిరాజ్ తదితరులు

చలో రాజ్‌భవన్‌కు తరలిన కార్యకర్తలు



బంగారపేట నుంచి బెంగళూరుకు బయల్దేరుతున్న నాయకులు, కార్యకర్తలు

బంగారపేట, ఆగస్టు 27: ముడా వివాదంలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతించడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. బెంగళూరు ఫ్రీడంపార్కులో భారీ నిరసన చేపట్టారు. పార్టీ పిలుపు మేరకు రాజ్‌భవన్ చలోలో పాల్గొనేందుకు బంగారపేట తాలూకా నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు బయల్దేరారు. పట్టంలోని ఎస్ఎన్ రిసార్టు వద్ద కర్ణాటక శోషిత సముదాయాల మహాసమాఖ్య, రాష్ట్ర వెనుకబడిన వర్గాల మహాసమాఖ్య ఆధ్వర్యంలో రాజ్‌భవన్ చలో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నారాయణస్వామి పచ్చజెండా చూపారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, బూదికోటె బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజ్, నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందుకుమార్, పురసభ సభ్యులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అధ్యక్ష ఎన్నిక

పావగడ, ఆగస్టు 27: ఏడాదిన్నర కాలంగావ ఖాళీగా ఉన్న మున్సిపల్ అధ్యక్ష స్థానానికి ఎట్టకేలకు మోక్షం వచ్చింది. బుధవారం అధ్యక్ష స్థానానికి ఎన్నిక జరగనుంది. 2019లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో 20మంది కాంగ్రెస్ సభ్యులు, ఇద్దరు జెడీఎస్, ఒకరు ఇండిపెండెంట్ సభ్యులుగా గెలుపొందారు. కేటగిరిపై అప్పట్లో కోర్టుకు వెళ్లడంతో ఎన్నిక ఆగిపోయింది. అనంతరం అధ్యక్ష పదవి ఎస్సీకి రావడంతో రెండున్నర సంవత్సరాలు ముగ్గురు అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. మిగిలి 14నెలలకు గాను అధ్యక్ష పదవి జనరల్ కేటగిరికి రావడంతో మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ముందుగా మాజీ మున్సిపల్ అధ్యక్షుడు కాంగ్రెస్ సీనియర్ నేత జీఎస్ ధర్మపాల్ కుమారుడు సురేష్ బాబుకు అధ్యక్ష పదవి కట్టబెట్టే అవకాశాలు అధికంగా కబన డుతున్నాయి. అదే కేటగిరికి చెందిన రవి కూడా పోటీలో ఉండే అవకాశం ఉంది. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడైన 14వ వార్డు నుంచి జనరల్ కేటగిరి నుంచి గెలుపొందిన రాజేష్ కూడా రేసులో ఉండడంతో అధ్యక్షస్థానంపై ఉత్కంఠ నెలకొంది.

